RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 205 Vol: 205 | ఆగస్టు 26 బుధవారం 2026 August 26 Wednesday2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

హైదరాబాద్‌లో నిరుపేదల

సొంతింటి కల

క్యూఆర్ పరిధిలో

వేగవంతంగా ఇందిరమ్మ

టవర్స్ నిర్మాణం 2

# సురేఖ, చిన్నారెడ్డి పదవుల తొలగింపునకు కమిటీ సిఫార్సు

## తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ వేటు ఉత్కంఠ:

**హైదరాబాద్ జనసంఘర్షణ**

కొండా తెలంగాణ కాంగ్రెస్‌లో నిబంధనలు ఉల్లంఘించి వివాదాస్పదంగా వ్యవహరించిన అటవీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు (క్యాబినెట్ ర్యాంకు) జి. చిన్నారెడ్డిలపై వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్‌లు రూపొందించిన సమగ్ర నివేదికను పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సమర్పించడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ నివేదికను పీసీసీ చీఫ్ ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లకు పంపించారు. క్రమశిక్షణా ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించకపోతే పార్టీకి, ప్రభుత్వ ఇమేజ్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కమిటీ నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై మంత్రి కొండా సురేఖ


Smt. Konda Surekha
Minister For Environment, Forest & Endowments
Government of Telangana

Off : Room No. 10,11,12, 4th Floor, Dr. B.R Ambedkar Telangana State Secretariat, Hyderabad, Telangana - 500022. Ph : +91 40 2345 0703, 2345 0708 E-mail : peshi-min-efe@telangana.gov.in

తేది : 20.08.2026

టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ శ్రీ మల్లు రవి గారికి,

విషయం : టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సంబంధించి నా వివరణ

నా జన్మదినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'కొండా' కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలుచోట్ల వేడుకలు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా, నా స్వస్థలమైన గీసుకొండతో తనకున్న ప్రత్యేక అనుబంధంతో, అక్కడి అభిమానులు, కార్యకర్తలు నిర్వహించిన నా జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా నా కూతురు కొండా సుస్మితా పటేల్ పాల్గొన్నది.

ఈ సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన స్వంత అభిప్రాయాలకు సంబంధించినవి. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, వివరణ కోరడం తగదు. దీనికి నన్ను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వినమ్రంగా తెలియజేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పై, పార్టీ క్రమశిక్షణా నియమావళి పై నాకు సంపూర్ణ గౌరవం ఉన్నది. కాబట్టి, పై వాస్తవాలను, ప్రజాస్వామ్య విలువలను పరిగణనలోకి తీసుకుని, ఈ విషయంలో నా ప్రమేయం లేదని గుర్తించి, నాకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని గౌరవపూర్వకంగా కోరుతున్నాను.

ధన్యవాదాలతో,

(కొండా సురేఖ)

Res : Quarter No. 9, Ministers Quarters, Banjara Hills, Hyderabad.



కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర విమర్శలను సురేఖ ఖండించకపోవడం, తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని సమర్థించుకోవడాన్ని క్రమశిక్షణా కమిటీ తప్పుపట్టింది. సురేఖ ఇప్పటికే మూడుసార్లు పార్టీ గీత దాటారని, ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించాలని నివేదికలో సిఫార్సు చేసినట్లు సమాచారం. మరోవైపు సీనియర్ నేత చిన్నారెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేను, నాయకత్వాన్ని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఇచ్చిన వివరణ అసంతృప్తికరంగా ఉందంటూ ఆయనను కూడా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించాలని పేర్కొంది. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ, పార్టీ గౌరవప్రతిష్ఠలు, క్రమశిక్షణే ముఖ్యమని తేల్చిచెప్పారు. ఎంతటి సీనియర్ నేతలైనా పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవనే హెచ్చరికను క్యాడర్‌కు పంపడమే తమ నివేదిక ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. తుది నిర్ణయం అధిష్ఠానం పరిధిలో ఉందనడంతో, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ నాయకత్వం ఈ ఇద్దరు కీలక నేతలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న అంశం ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

➤ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాల మధ్య రవాణాకు ఊతం

- రూ. 840.41 కోట్లతో జాతీయ రహదారి
- 365 విస్తరణకు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత పెంచేలా జాతీయ రహదారి 365 అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా బుట్టాయగూడెం-ఎల్ఎన్‌డీ పేట, పట్టిసీమ-కొవ్వూరు సెక్షన్ల పరిధిలోని 45.09 కిలోమీటర్ల మేర రహదారి ఉన్నతీకరణ (అప్‌గ్రేడేషన్) పనుల కోసం రూ. 840.41 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 2-లేన్ల జాతీయ రహదారికి ఇరువైపులా పేవ్‌డ్ షోల్డర్లతో కూడిన విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఆయన

➤ మిగతా 2వ పేజిలో..

# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

**శ్రీశైలం వడ్డెర సత్రంలో తీవ్ర విషాదం**

**శ్రీశైలం జనసంఘర్షణ**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో అత్యంత దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానిక వడ్డెర అన్నదాన సత్రంలోని ఒకే గదిలో కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గత మూడు రోజులుగా సత్రంలోని సదరు గది తలుపులు తీయకపోవడం, లోపలి నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన నిర్వాహకులు

➤ మిగతా 2వ పేజిలో..

# శ్రీశైల క్షేత్రంలో భక్తులకు బిగ్ అలర్ట్

**స్పర్శదర్శనం నిలిపివేత, పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ట్రస్ట్ బోర్డు**



**శ్రీశైలం జనసంఘర్షణ**

శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన 10వ ట్రస్ట్ బోర్డు సమావేశంలో భక్తుల సౌకర్యార్థం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు ఎజెండాలో పెట్టిన మొత్తం 18 అంశాల్లో 15 అంశాలకు పాలకమండలి ఆమోదం తెలుపగా, మరో 3 ప్రతిపాదనలను వాయిదా వేసింది. రద్దీని నియంత్రించడంతో పాటు సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించే లక్ష్యంతో శని, ఆది, సోమవారాల్లో నిర్వహించే స్పర్శదర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోర్డు సభ్యులు వెల్లడించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే యాత్రికుల సౌకర్యార్థం సుమారు 12 వేల మంది ఏకకాలంలో వేచి ఉండేలా అత్యాధునిక వసతులతో 3 అంతస్తుల క్యూ కాంప్లెక్స్ నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు

➤ మిగతా 2వ పేజిలో..

# పది రోజుల్లో పసిడి పైపైకి..

**అంతర్జాతీయ ఒడిదొడుకులు: పదిరోజుల్లో రికార్డు స్థాయికి బంగారం ధరలు**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

గత పది రోజులుగా ఆకాశమే హద్దుగా పెరుగుతున్న బంగారం ధరలకు మంగళవారం స్వల్పంగా విరామం లభించింది. పసిడి ప్రియులకు కొంత ఊరటనిస్తూ 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 220 తగ్గి రూ. 1,63,750కు చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 200 తగ్గి రూ. 1,50,100 వద్ద ముగిసింది. అయితే ఈ స్వల్ప తగ్గుదలను చూసి బంగారం ధరలు దిగివస్తున్నాయని భావించలేమని విశ్లేషకులు చెబుతున్నారు. ఆగస్టు 16 నుంచి 25 మధ్య కేవలం పది రోజుల్లోనే 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 8,620, అలాగే 22 క్యారెట్ల బంగారం రూ. 7,900 మేర పెరిగింది. ఆగస్టు 3న రూ. 1,41,155 వద్ద ఉన్న 10 గ్రాముల బంగారం ధర ఆగస్టు 25 నాటికి రూ. 1,63,437కి చేరి, ఈ ఒక్క నెలలోనే ఏకంగా 15.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో మూడేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 4,640.39 డాలర్ల వద్ద స్వల్పంగా వెనక్కి తగ్గడం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మంగళవారం నాటి రిటైల్ ధరల ప్రకారం హైదరాబాద్, ముంబై, బెంగళూరు, కొల్కతా, పుణే నగరాల్లో 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ. 16,375గా ఉండగా, ఢిల్లీలో రూ. 16,390, చెన్నైలో రూ. 16,398గా నమోదైంది. స్థానిక పన్నులు, విమాన

➤ మిగతా 2వ పేజిలో..

# పైలట్లకు వార్షిక డోపింగ్ పరీక్షలు

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

విమాన ప్రయాణికుల భద్రతను మరింత కఠినతరం చేసే దిశగా కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఇకపై దేశంలోని ప్రతి విమాన పైలట్‌కు ఏడాదికి కనీసం ఒక్కసారైనా డోపింగ్ పరీక్షలు నిర్వహించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. పైలట్లు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల

➤ మిగతా 2వ పేజిలో..

# తెలుగు రాష్ట్రాల మధ్య రవాణాకు ఊతం

**మొదటిపేజీ తరువాయి..** తెలిపారు. ఈ రహదారి పునర్నిర్మాణంతో పోలవరం ప్రాజెక్టుతో పాటు దాని పరిసర గ్రామాలకు రవాణా సదుపాయం మెరుగవుతుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. పామాయిల్, చెరకు, పొగాకు పంటలు ఎక్కువగా పండే ఈ ప్రాంతంలో మౌలిక వసతులు అభివృద్ధి చెందడం వల్ల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా, సురక్షితంగా తరలించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటంతో పాటు ప్రజల జీవనోపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా వచ్చే ఏడాది రాబోయే గోదావరి పుష్కరాల సమయానికి ఈ రహదారి అందుబాటులోకి వస్తే పుణ్యక్షేత్రాలు, ఘాట్ల వద్దకు చేరుకునే భక్తులకు, అలాగే పోలవరం ప్రాజెక్టును సందర్శించే పర్యాటకులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని గడ్కరీ వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతో పాటు పర్యాటక రంగం, వాణిజ్య రవాణా మరింత ఊపందుకుంటుంది.

## శ్రీశైల క్షేత్రంలో భక్తులకు బిగ్ అలర్ట్

**మొదటిపేజీ తరువాయి..** పాలకమండలి తెలిపింది. దీనితో పాటు శ్రీశైల దక్షిణ ద్వారంగా భావించే జ్యోతిస్సిద్ధవట ఆలయాన్ని రూ. 19 లక్షలతో ప్రత్యేకంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవటంలో నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దేవస్థాన జమాఖర్చుల పరిశీలన కూడా సాగుతోందని పేర్కొన్నారు. భక్తులకు, శివసేవకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పలు అభివృద్ధి పనులకు బోర్డు ఆమోదం తెలిపింది. శివసేవకుల వసతి గృహాల్లో రూ. 19 లక్షల వ్యయంతో పరుపులు, దిండ్లు ఏర్పాటు చేయనున్నారు. రూ. 9.20 లక్షలతో గణేశ సదన్, రింగ్ రోడ్డు సెంట్రల్ పార్కింగ్ ప్రాంతాల్లో సిమెంట్ కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నారు. అలాగే రూ. 32 లక్షలతో పారుగుదొడ్లు, డ్రైనేజీ మరమ్మతులు, ఫ్లోరింగ్ పనులు నిర్వహించాలని తీర్మానించారు. ఆలయంలో భక్తులు కానుకలుగా సమర్పించే వస్త్రాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా 'వస్త్రాల స్వీకరణ కేంద్రం' ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించింది.

## 22ఎ భూముల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్

రాష్ట్రంలో 22ఎ నిషేధిత భూముల పేరుతో జరుగుతున్న భారీ అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. కమీషన్ల కక్కుర్తి కోసమే ప్రభుత్వం సామాన్య ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలోకి నెట్టిందని మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్‌లో 22ఎ భూముల సమస్యలతో సతమతమవుతున్న బాధిత కుటుంబాల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్నలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితుల ఆవేదనను అడిగి తెలుసుకున్న హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ బాధితులకు పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజల భూములతో చెలగాటమాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బర్తరఫ్ చేయాలని హరీశ్ రావు కోరారు. 98 శాతం భూములను 22ఎ నుంచి తొలగించామని మంత్రి అబద్ధాలు చెప్తున్నారని, అదే నిజమైతే వందలాది మంది బాధితులు రోడ్డెక్కాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే నిషేధిత భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ధరణి/వెబ్‌సైట్‌లో 22ఎ జాబితాను ఎందుకు బ్లాక్ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్, పద్మారావు నగర్ ఫేజ్-1, స్ప్రింగ్ ఫీల్డ్ వంటి దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను, చివరికి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్, సీఎంతో పాటు సామాన్యుల ఇళ్లను కూడా 22ఎ జాబితాలో పెట్టడం ప్రభుత్వ అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాల వ్యవసాయ భూములను 22ఎలో పెట్టడం వల్ల రైతులకు రైతుబంధు, విద్యుత్ కనెక్షన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన వర్గానికి వందల కోట్ల విలువైన భూములు కట్టబెడుతూ, సామాన్యుల భూములను మాత్రం విక్రయాలకు పెట్టారని ధ్వజమెత్తారు. బాధితుల పక్షాన నిలబడి రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని, సభను స్తంభింపజేసి అయినా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఆత్మహత్య

**మొదటిపేజీ తరువాయి..** వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గది తలుపులు పగలగొట్టి పరిశీలించగా.. బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, గదిలోని ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరికి వేలాడుతూ కనిపించారు.
మృతులను శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ (36), గోగుల ఆదిలక్ష్మి (50), మల్లేశ్వరి (45), శ్రీదేవి (33), మణికంఠ (15)గా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే వీరు ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి దర్యాప్తు ప్రారంభించారు.
బాధిత కుటుంబం జూలై 28న రోజుకు 800 రూపాయల చొప్పున అద్దె చెల్లించి సత్రంలోని రూమ్ నంబర్ 11ను తీసుకున్నట్లు తెలిసింది. నియమాల ప్రకారం రెండు రోజుల తర్వాత ఖాళీ చేయమని కోరినప్పటికీ, తమకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, పూజలు చేయించుకుని వెళ్తామని చెప్పి నెల రోజులుగా అక్కడే ఉంటున్నట్లు వెల్లడైంది. అయితే, సాధారణ యాత్రికులకు కేటాయించే సత్రం గదిని నిబంధనలకు విరుద్ధంగా నెల రోజుల పాటు ఎందుకు కొనసాగనిచ్చారనే కోణంలో సత్రం యాజమాన్యాన్ని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఆ కుటుంబం శ్రీశైలంలోనే నెల రోజులుగా ఎందుకు ఉండిపోయింది, ఆత్మహత్యకు గల పూర్తి కారణాలేమిటి అనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

## పది రోజుల్లో పసిడి పైపైకి..

**మొదటిపేజీ తరువాయి..** రవాణా రుసుములు, బులియన్ మార్కెట్ సమయాన్ని బట్టి నగరాల మధ్య ఈ స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. అమెరికా బాండ్ ఈల్డ్స్, డాలర్ విలువ తగ్గిపోవడం, సురక్షిత పెట్టుబడిగా బంగారంపై గిరాకీ పెరగడం వంటి పరిణామాలు పసిడి రికార్డు పరుగుకు ప్రధాన కారణంగా నిలిచాయి. మరోవైపు భౌతిక బంగారంతో పోలిస్తే ఇటీవల కాలంలో మొబైల్ యాప్‌ల ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. డిజిటల్ గోల్డ్ ధరలు అంతర్జాతీయ స్పాట్ రేట్లు, రూపాయి మారకం విలువ ఆధారంగా ప్రతిక్షణమూ మారుతుంటాయని, నగల షాపుల ధరలతో పోలిస్తే కొనుగోలు-అమ్మకాల (ఌజాతీమ్ఘం) మధ్య స్వల్ప వ్యత్యాసం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌లలో తయారీ కూలీ (మేకింగ్ ఛార్జీలు) ఉండకపోవడం వల్ల దీనిని స్వచ్ఛమైన ఇన్వెస్ట్‌మెంట్‌గా చూడవచ్చని సూచిస్తున్నారు. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, రాబోయే ఫెడ్ రిజర్వ్ ప్రసంగాల ఆధారంగా రానున్న రోజుల్లో బంగారం రేట్లలో మరిన్ని హెచ్చుతగ్గులు ఉండే అవకాశముందని, అంతర్జాతీయంగా బంగారం 4,600 డాలర్ల స్థాయి దిశగా సాగుతోందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన రద్దుపై పొలిటికల్ సెగ

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలుతెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన ప్రతిపాదిత అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే అడ్డుకుందంటూ చేసిన వ్యాఖ్యలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా తోసిపుచ్చారు. రేవంత్ రెడ్డి ఆరోపణలు పూర్తి అర్థరహితమని, ముఖ్యమంత్రులు లేదా కేంద్ర మంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతులు మంజూరు చేసే నిబంధనలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ అమల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఎలాంటి నియమాలను తీసుకురాలేదని, దౌత్య పరమైన నిబంధనలు, జాతీయ ప్రయోజనాలు మరియు పర్యటన ముఖ్య ఉద్దేశాలను పరిశీలించిన తర్వాతే విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) పర్యటనలకు అనుమతినిస్తుందని న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్ బిజినెస్ స్కూల్ కోర్సుకు, లండన్ పర్యటనకు కేంద్రం నిబంధనల ప్రకారం ఆమోదం తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అమెరికా పర్యటన ప్లాన్‌లో భాగంగా భారత్‌కు తీవ్ర వ్యతిరేకి అయిన న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీని కలవాలని సీఎం భావించారనే వార్తలపై రేవంత్ రెడ్డి స్పష్టమైన వివరణ ఇవ్వాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. భారత ప్రధానిని ఉగ్రవాదితో పోలుస్తూ వ్యాఖ్యలు చేయడమే కాకుండా, నగరంలో దీపావళి వంటి పండుగల నిర్వహణపై ఆంక్షలు విధించే మమ్దానీ లాంటి వ్యక్తిని కలవాల్సిన అవసరం సీఎంకు ఎందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. గతంలో గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలను యూపీఏ ప్రభుత్వం అడ్డుకుందని, అలాగే కేంద్ర మంత్రిగా ఉన్న తన విదేశీ పర్యటన ప్రతిపాదనలకు కూడా విదేశాంగ శాఖ నిరాకరించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాబట్టి విదేశాంగ శాఖ నిర్ణయాల్లో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకువస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి, ముందుగా స్థానిక విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు

# పైలట్లకు వార్షిక డోపింగ్ పరీక్షలు

**మొదటిపేజీ తరువాయి..** బారిన పడకుండా అరికట్టడానికి, భవిష్యత్తులో కఠిన నిబంధనలు అమలు చేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రస్తుతం వివిధ విమానయాన సంస్థలతో సంప్రదింపులు జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం మొత్తం పైలట్ల సంఖ్యలో కేవలం 10 శాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ పరిమితిని పెంచి, ప్రతీ పైలట్‌నూ ఏటా పరీక్షించేలా నియమ నిబంధనలను రూపొందించేందుకు డీజీసీఏ కసరత్తు చేస్తోంది. ఇటీవల బ్యాంకాక్ పరిధిలోని ఫుకెట్ నుండి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానం ఆగస్టు 4న గాల్లో తీవ్ర కుదుపులకు లోనై, 17 మంది ప్రయాణికులు గాయపడిన ఘటన ఈ నిర్ణయానికి మరింత ప్రాధాన్యం చేకూర్చింది. ఈ ప్రమాదం అనంతరం సంబంధిత పైలట్లకు నిర్వహించిన పరీక్షల్లో ఒక పైలట్ గంజాయి (సైకోయాక్టివ్ డ్రగ్స్) ఉపయోగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఈ విమాన ఘటనపై ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో విస్తృత స్థాయిలో దర్యాప్తు జరుపుతోంది. విమానానికి సంబంధించిన డేటా రికార్డర్లు సురక్షితంగా దర్యాప్తు సంస్థల వద్ద ఉన్నాయని, అతి త్వరలోనే ప్రాథమిక నివేదిక విడుదలవుతుందని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విమాన ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, విమానయాన సంస్థల రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ నిబంధనలను సమతుల్యంగా అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## భూమిని లబ్ధిదారుల పేరిట ఉచిత రిజిస్ట్రేషన్

### హైదరాబాద్‌లో నిరుపేదల సొంతింటి కల

### క్యూఆర్ పరిధిలో వేగవంతంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

హైదరాబాద్

మహా నగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారు ఆత్మగౌరవంతో జీవించేలా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరమ్మ టవర్స్' నిర్మాణ పనులు వేగవంతమయ్యాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార



పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ మరియు కొత్త దరఖాస్తుల స్వీకరణపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.
మొదటి విడతలో భాగంగా క్యూఆర్ (GHMC/HMDA) పరిధిలోని 16 నియోజకవర్గాల్లో రూ. 807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఇళ్ల కోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15 వరకు దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 40,900 మందిని అర్హులుగా, 19,820 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అనర్హతకు గల కారణాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అర్హులైన అభ్యర్థుల సమక్షంలో ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నారు. లక్కీ డ్రాలో ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ. 10,000 ఈఎమ్‌డీ (EMD) మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తామని స్పష్టం చేశారు.

**లక్కీ డ్రా నిర్వహణ వివరాలు:**

**ఆగస్టు 27:** రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రెడ్ హిల్స్.

**ఆగస్టు 28:** కొకూర్, పాటిగెడ్డ, జల్ పల్లి, కుల్సుంపుర.

**ఆగస్టు 29:** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, బండ్లగూడ (ఎల్‌ఐజీ కాలనీ), నందిముసలిగూడ.

**ఆగస్టు 30:** గాజులరామారం, అంబర్‌పేట్ సిటీ పోలీస్ లైన్స్, గడ్డిఅన్నారం, ఆర్అండ్ బి క్వార్టర్స్, పోచారం (ఎల్ఐజీ కాలనీ).

మరో 4 నియోజకవర్గాల్లో కొత్తగా దరఖాస్తుల ఆహ్వానం:
నగర పరిధిలో కొత్తగా మరో 4 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్ల నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఎల్‌బీనగర్ (హయత్‌నగర్ అమంగల్), గోషామహల్ (నాంపల్లి), ముషీరాబాద్ (జమిస్తాన్‌పూర్ ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట (బండ్లగూడ ఫలక్‌నుమా సమీపంలో) నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన పేద ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.
ఈ పథకం కింద 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మిస్తారని, అన్‌డివైడెడ్ షేర్ విధానంలో సుమారు 20-25 గజాల విలువైన భూమిని లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ప్రాంతాన్ని బట్టి ఈ భూమి విలువ రూ. 60 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నారు. ఈ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తుండగా, లబ్ధిదారుడి వాటా కేవలం రూ. 6 లక్షలు మాత్రమేనని, దానిని కూడా నాలుగు విడతల్లో చెల్లించే సదుపాయం కల్పించామని మంత్రి వివరించారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి.
- మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (జన సంఘర్షణ)





పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ జో.జి,డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసితో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు .19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి 60.83శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు,అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా ,ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి,అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని,పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినిలు అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

- బీర్కూరు పీహెచ్‌సీలో రూ.3 లక్షలతో నిర్మాణం..
- భూమిపూజ చేసిన సర్పంచ్ అరిగే ధర్మతేజ, ఎంపీడీవో శ్రీనిధి

బీర్కూరు,/ ఆగస్టు 25 /(జనసంఘర్షణ):



బీర్కూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. స్వచ్ఛభారత్, గ్రామపంచాయతీ ఉమ్మడి నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు సర్పంచ్ అరిగే ధర్మతేజ, ఎంపీడీవో శ్రీనిధి ముగ్గు వేసి భూమిపూజ చేశారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో ఉండేలా ఈ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 20 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న మరుగుదొడ్లకు మొత్తం రూ.3 లక్షలు కేటాయించారు. ఇందులో స్వచ్ఛభారత్ నిధుల నుంచి రూ.2.10 లక్షలు, గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.90 వేలు వినియోగించనున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల... కల్పనలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంపీవో మెహబూబ్, ఉపసర్పంచ్ పరమేష్, పంచాయతీ కార్యదర్శి గంగారం, జూనియర్ అసిస్టెంట్ హనుమంతరావు, వార్డు సభ్యులు రాహుల్, బసవరాజ్, రఘు, శంకర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిరెడ్డిని కలిసిన మెదక్ మండల నాయకులు

- పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (జన సంఘర్షణ)



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని మెదక్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్వీ మెదక్ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్ ఆధ్వర్యంలో జానకంపల్లి, చిట్యాల, సంగాయిగూడ గ్రామాల మాజీ సర్పంచ్‌లు సంగమేష్, వెంకటేష్, రవి, మాజీ ఎంపీటీసీ మల్లేశం తిరుపతిరెడ్డి నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పార్టీ బలోపేతం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి విస్తృతంగా నిర్వహించాలని, యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు, మల్లయ్య, దుర్గా నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెక్కి క్యాంపు సబ్‌స్టేషన్‌కు అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్






బోధన్, ఆగస్టు 25 (జన సంఘర్షణ)

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అధిక లోడ్ కారణంగా ఏర్పడే ట్రిప్పింగ్స్, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు బోధన్‌లోని 33/11 కేవీ చెక్కి క్యాంపు సబ్‌స్టేషన్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌లో ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్‌రెడ్డి మంజూరు చేయగా, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి మంగళవారం నిజామాబాద్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వి. రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. దీంతో చెక్కి క్యాంపు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగడంతో పాటు లోడ్ సమస్యలు, ట్రిప్పింగ్స్ తగ్గే అవకాశం ఉంది. అదేవిధంగా వినియోగదారులు, సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేసిన బోధన్ టౌన్-2 నూతన సెక్షన్ కార్యాలయ భవనాన్ని సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వి. రాజేశ్వర్‌రావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. మరోవైపు 33/11 కేవీ చెక్కి క్యాంపు సబ్‌స్టేషన్‌ను లిరిమోట్ మానిటరింగ్ సబ్‌స్టేషన్ (ఆర్ఎంఎస్)గా ఆధునీకీకరించి వరంగల్‌లోని ఎసీఏడీఏ (సూపర్వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) కేంద్రానికి అనుసంధానం చేశారు. ఈ సాంకేతికత పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వరంగల్‌లోని ఎసీఏడీఏ కేంద్రం నుంచి సబ్‌స్టేషన్‌ను రిమోట్‌గా, మానవరహితంగా ఆపరేట్ చేసే అవకాశం ఉంటుంది. కార్యక్రమంలో బోధన్ డివిజనల్ ఇంజనీర్ ముక్తార్ మొహమ్మద్, నిజామాబాద్ టెక్నికల్, ఎంఆర్‌టీ & కన్‌స్ట్రక్షన్ డివిజనల్ ఇంజనీర్ డి. వెంకటరమణ, బోధన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కే. నగేష్‌కుమార్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఏఈ నటరాజ్, బోధన్ టౌన్-2 ఏఈ కళ్యాణ్, టౌన్-1 ఏఈ కృష్ణ, టీఆర్ఈ ఏఈ సాయిలు, సివిల్ ఏఈ కార్తీక్‌తో పాటు బోధన్ టౌన్-2 సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

# భారతీయ స్త్రీ – శక్తి స్వరూపిణి



స్త్రీ అంటే ఒక రూపం కాదు-ఒక జీవన వేదం,
స్త్రీ అంటే ఒక పేరు కాదు-ఒక కుటుంబానికి ప్రాణం!
"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"
అని స్త్రీని గౌరవించిన నేల ఇది,
నారీ శక్తిని నిత్యమూ నమస్కరించిన భారతదేశం ఇది!
అమ్మగా ఆది శక్తి, అక్కగా ఆప్యాయత,
చెల్లిగా చల్లని అనురాగం, భార్యగా జీవిత సహచరి,
కూతురిగా ఇంటి వెలుగు- ప్రతి బంధంలోనూ
స్త్రీ ఒక అపురూపమైన వరం!
దుర్గగా దుష్ట సంహారం, లక్ష్మిగా ఐశ్వర్య ప్రదానం,
సరస్వతిగా జ్ఞాన ప్రసాదం, పార్వతిగా ప్రేమకు ప్రతిరూపం,
సీతగా సహనానికి ప్రతీక, సావిత్రిగా పాతివ్రత్యానికి ప్రతిమ,
రాణి రుద్రమదేవిగా పరాక్రమం,
ఝాన్సీ లక్ష్మీబాయిగా వీరత్వం
స్త్రీలోనే ఎన్నో శక్తుల సంగమం!
ఇలవేల్పుగా ఇంటిని కాపాడుతూ,
ఇల్లాలిగా ఇల్లును నడిపిస్తూ,
తల్లిగా తరాలను తీర్చిదిద్దుతూ,
గురువుగా జ్ఞానాన్ని పంచుతూ,
సమాజానికి సంస్కారాన్ని నేర్పుతూ,
దేశానికి దిశానిర్దేశం చేస్తూ- స్త్రీ తన ఉనికిని
యుగయుగాలుగా చాటింది!
ఆమె చేతి ముద్దలో అమ్మతనం ఉంది,
ఆమె మాటలో అనురాగం ఉంది,
ఆమె అడుగులో ఆత్మవిశ్వాసం ఉంది,
ఆమె హృదయంలో అంతులేని కరుణ ఉంది!
పసిపాపగా పుట్టిన క్షణమే
ఇంటి గడపకు పండుగ తెచ్చేది ఆమె,
యువతిగా ఎదిగిన వేళ
కలలకు రెక్కలు తొడిగేది ఆమె,
భార్యగా అడుగుపెట్టిన వేళ
జీవితానికి అర్థం చేకూర్చేది ఆమె,
తల్లిగా మారిన వేళ
తన ప్రాణాన్నే పంచేది ఆమె!
తన కన్నీటిని దాచుకొని కుటుంబానికి చిరునవ్వు పంచుతుంది,
తన బాధను భరిస్తూ బిడ్డల భవిష్యత్తును నిర్మిస్తుంది,
తన కలలను పక్కనపెట్టి ఇతరుల కలలకు రంగులు అద్దుతుంది
అందుకే స్త్రీ త్యాగానికి చిరునామా!
పొయ్యి దగ్గర నిలిచినా ఆమె ఒక శక్తి,
పాఠశాలలో నిలిచినా ఆమె ఒక శక్తి,
పొలంలో పనిచేసినా ఆమె ఒక శక్తి,
పరిశోధనశాలలో నిలిచినా ఆమె ఒక శక్తి!
ఆకాశంలో విహరించే విమానానికి పైలట్ అయినా ఆమె,
సరిహద్దులో దేశాన్ని కాపాడే సైనికురాలైనా ఆమె,
న్యాయాన్ని నిలబెట్టే న్యాయమూర్తైనా ఆమె,
జ్ఞానదీపం వెలిగించే ఉపాధ్యాయురాలైనా ఆమె!
ఇది కేవలం స్త్రీని పూజించే దేశం మాత్రమే కాదు
స్త్రీలోని శక్తిని గుర్తించిన సంస్కృతి కలిగిన దేశం!
భారతీయ సంస్కృతిలో స్త్రీని బలహీనురాలిగా చూడలేదు,
"శక్తి"గా చూశారు; "మాతృమూర్తి"గా చూశారు;
"దేవత"గా భావించారు; "జగన్మాత"గా ఆరాధించారు!
అమ్మను దేవుడికంటే ముందుగా గౌరవించిన సంస్కృతి మనది,
భూమిని "భూమాత"గా పిలిచిన సంస్కృతి మనది,
నదులను "గంగమ్మ", "గోదారమ్మ"గా
తల్లులుగా భావించిన సంస్కృతి మనది!
స్త్రీని గౌరవించడం అంటే ఒక వ్యక్తిని గౌరవించడం కాద-
ఒక కుటుంబాన్ని గౌరవించడం, ఒక తరాన్ని గౌరవించడం,
ఒక సమాజాన్ని గౌరవించడం, మానవత్వాన్నే గౌరవించడం!
స్త్రీ నవ్వితే ఇల్లు నవ్వుతుంది,
స్త్రీ ఎదిగితే కుటుంబం ఎదుగుతుంది,
స్త్రీ చదివితే తరాలు చదువుతాయి,
స్త్రీ సాధిస్తే సమాజం సాధిస్తుంది!
అందుకే ఆమె రెక్కలను కత్తిరించకండి,
ఆమె అడుగులను ఆపకండి,
ఆమె కలలను చిన్నచూపు చూడకండి,
ఆమె ప్రతిభకు హద్దులు పెట్టకండి!
ఆమెకు కావలసింది
కరుణ కాదు--కావాల్సింది గౌరవం,
ఆమెకు కావలసింది
అనుకంప కాదు--కావాల్సింది సమాన అవకాశం,
ఆమెకు కావలసింది
అభినందన మాత్రమే కాదు
తన సామర్థ్యాన్ని నిరూపించుకునే స్వేచ్ఛ!
స్త్రీని పూజించే చేతులు స్త్రీని బాధించకూడదు,
స్త్రీని దేవతగా కొలిచే సమాజం
ఆమెకు భద్రత కల్పించాలి,
స్త్రీని మాతృమూర్తిగా గౌరవించే మనసులు
ఆమె స్వేచ్ఛను కాపాడాలి!
ఎందుకంటే స్త్రీకి ఇచ్చే గౌరవమే
సంస్కృతికి నిజమైన అద్దం,
స్త్రీకి ఇచ్చే స్వేచ్ఛే
సమాజ ప్రగతికి నిజమైన కొలమానం!
స్త్రీ అబల కాదు-అపారబల!
స్త్రీ అలంకారం కాదు-ఆధారం!
స్త్రీ బంధనం కాదు-బలం!
స్త్రీ వెనుకబడినది కాదు-విజయానికి ముందడుగు!
ఆమె చేతుల్లో రేపటి భారతం ఉంది,
ఆమె హృదయంలో రేపటి మానవత్వం ఉంది,
ఆమె విద్యలో రేపటి విజ్ఞానం ఉంది,
ఆమె అడుగుల్లో రేపటి ప్రగతి ఉంది!
కాబట్టి- స్త్రీని గౌరవిద్దాం,
స్త్రీని చదివిద్దాం, స్త్రీని ఎదగనిద్దాం,
స్త్రీకి సమాన అవకాశమిద్దాం!
దేవతగా గుడిలోనే కాదు,
మనసులోనూ కొలుద్దాం;
తల్లిగా ఇంటిలోనే కాదు,
సమాజంలోనూ గౌరవిద్దాం!
స్త్రీ ఉన్న చోటే సౌభాగ్యం,
స్త్రీ నవ్విన చోటే ఆనందం,
స్త్రీ ఎదిగిన చోటే అభ్యుదయం,
స్త్రీ గౌరవించబడిన చోటే
నిజమైన భారతీయ సంస్కృతి వికసిస్తుంది!
జై నారీ శక్తి!
జై మాతృశక్తి!
జై భారతీయ సంస్కృతి!

రచన :బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
బుధవారం
26 ఆగస్టు 2026

# సాలూర పరపతి సంఘంపై ఫిర్యాదు..

- బాధితులకు ఫోన్ బెదిరింపులు..
- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి..
- ఉన్నతాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని బాధితుల విజ్ఞప్తి!

సాలూర, /ఆగస్టు 25 /(జనసంఘర్షణ): సాలూర మండల వ్యవసాయ పరపతి సంఘంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంఘం వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. అయితే ఫిర్యాదు చేసిన అనంతరం తమపై ఒత్తిడి పెరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని కోరుతూ..... పరపతి సంఘానికి చెందిన కొందరు సభ్యులు తమకు



ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు. ఫిర్యాదు చేసినందుకు తమను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని వారు పేర్కొన్నారు. అవకతవకలపై ఫిర్యాదు చేసిన తమకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి... పరపతి సంఘంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు. ఫిర్యాదును ఉపసంహరించుకునేలా బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కూడా విచారణ జరిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# బోధన్ సార్వజనిక్ అధ్యక్షుడిగా పూజారి లింగం..







- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక..
- వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై చర్చ.....

బోధన్, /ఆగస్టు 25/ (జనసంఘర్షణ): వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని బోధన్ పట్టణ సార్వజనిక్ వినాయక ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం చక్రేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పూజారి లింగం, ప్రధాన కార్యదర్శిగా ఉద్మీర్ సందీప్, కోశాధికారిగా నంద్యాల శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు, శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా సమన్వయంతో ముందుకు సాగాలని నూతన కమిటీ సభ్యులు నిర్ణయించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# గోమాతకు హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం ఘనంగా అంత్యక్రియలు

- అనారోగ్యంతో మృతి చెందిన ఆవుకు పూలమాలలు, ప్రత్యేక పూజలు..
- గౌరవప్రదంగా అంతిమ వీడ్కోలు





వర్ని,/ ఆగస్టు 25/ (జనసంఘర్షణ): నిజామాబాద్ జిల్లా వర్ని మండలం ఎస్ఎన్ పురం గ్రామపంచాయతీ పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన ఆవుకు గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గోమాతకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు చేపట్టి గౌరవప్రదంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. హిందూ ధర్మ సంప్రదాయాల్లో గోవును గోమాతగా, అమ్మగా భావిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆవుకు కూడా మనిషికి ఇచ్చే గౌరవంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గోవుల పట్ల ప్రజల్లో ఉన్న భక్తి, గౌరవాన్ని చాటిచెప్పేలా ఈ అంతిమ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గోమాతకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించడం గ్రామంలో ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అప్పాయిగూడెంలో ఘనంగా వన మహోత్సవం

- సర్పంచ్ దండు ప్రవీణ్




కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపే లక్ష్యంగా సింగరేణి మండలం, అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు కలసికట్టుగా పాల్గొని పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాలు, రహదారుల ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తూ, అప్పాయిగూడెంను హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ... పర్యావరణ సమతుల్యతకు చెట్లే కీలకమని,నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.పద్మ, సర్పంచ్ దండు ప్రవీణ్, ఏపీవో అప్పారావు, ఈసీ సుధీర్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, బిఎఫ్టి వసంత్, వీఓఏ బాలకృష్ణ, మేట్ అజ్మీరా సురేష్, పంచాయతీ సిబ్బంది, వేజ్ సీకర్స్, గ్రామ ప్రజలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ రేణుక సమేత పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి ఆహ్వానం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (జన సంఘర్షణ)



శంకరంపేట( ఆర్ )మండల కేంద్రంలో మాల శ్రీ రేణుక సమేత పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఏమా వెంకటేశం, సొసైటీ డైరెక్టర్ మల్ల నారాయణ, మేకల యాదగిరి పాంబండ రాజు సుంకర వెంకట్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# బోధన్ సార్వజనిక్ అధ్యక్షునిగా పూజారి లింగం ఎన్నిక

బోధన్, ఆగస్టు 25(జన సంఘర్షణ)



వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని బోధన్ పట్టణ సార్వజనిక్ వినాయక ఉత్సవ కమిటీ ఎన్నిక మంగళవారం చక్రేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా పూజారి లింగం, ప్రధాన కార్యదర్శిగా ఉద్మీర్ సందీప్, కోశాధికారిగా నంద్యాల శ్యామ్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన పున్న బూదయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతార్ పల్లి గ్రామానికి చెందిన పన్న బూదయ్య అనారోగ్యంతో మరణించారు. ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దూరి సునీల్,ఉప సర్పంచ్ యాదగిరి,గ్రామ అధ్యక్షుడు ఏరుపుల దుర్గం, పున్న యాదగిరి, రాగి నారాయణ, స్వామి, మహేష్, లక్ష్మయ్య, సిహెచ్ స్వామి, సుధాకర్, సత్యం, శ్రీకాంత్, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక సమేత పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠకు పద్మ దేవేందర్ రెడ్డికి ఆహ్వానం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా శంకరంపేట (ఆర్)మండల కేంద్రంలో మాల శ్రీ రేణుక సమేత పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న శ్రీ రేణుక సమేత, పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం పద్మ దేవేందర్ రెడ్డిని వారి నివాసంలోమర్యాదపూర్వకంగా కలిసి మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట మండల పార్టీ అధ్యక్షుడు పట్లోరి రాజు, సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, మల్లుపల్లి సర్పంచ్ ఇమ్మడి నరేష్, మాజీ ఎంపీటీసీ ఏమా వెంకటేశం, సొసైటీ డైరెక్టర్ మల్గా నారాయణ, నాయకులు సుంకరి వెంకట్ గౌడ్, బండ రాజు మ్యాకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి

- రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అలాంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన రాష్ట్రంలో ఉండడం గర్వకారణం..
- అక్బర్ నగర్ గ్రామ సర్పంచ్ ముదునూరి సీతారామరాజు

రుద్రూర్: ఆగస్టు 25( జన సంఘర్షణ)




నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం అక్బర్ నగర్ గ్రామంలోని హెల్త్ సెంటర్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రతి చోటా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పారిశుధ్యం సక్రమంగా ఉంచేలా చూస్తున్నామని, మంచినీరు అందించడంలో కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామ ప్రజలు సైతం ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అనారోగ్యం అనిపిస్తే గ్రామంలో ఉన్న వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. గ్రామ గ్రామాల్లో ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆరోగ్యం పేద ప్రజలకు అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గం వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని ఆయన సహకారంతో గ్రామం మరింత అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ రవికుమారి, ఏఎన్ఎంలు అనిత. రమాదేవి. గ్రామ ప్రజలు ఉన్నారు.

## లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు..

బాన్సువాడ,/ ఆగస్టు 25 /(జనసంఘర్షణ):



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని లండన్‌లో మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు సమాచారం. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం పేర్కొన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఏనుగు రవీందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిసింది. లండన్‌లో జరిగిన ఈ భేటీకి సంబంధించిన అంశాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## మధుమలాంచ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల పునర్నిర్మాణం

- విద్యార్థులు మరుగుదొడ్లను పరిశుభ్రంగా వినియోగించుకోవాలి: డీఈఓ పి. అశోక్

బోధన్, ఆగస్టు 25 (జన సంఘర్షణ)




మధుమలాంచ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మరుగుదొడ్లను రూ.1,34,162 వ్యయంతో పూర్తిస్థాయిలో పునర్నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో మరుగుదొడ్ల సమస్యపై మీడియాలో వచ్చిన కథనాలను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం బోధన్ ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజెస్ అసోసియేషన్, ట్రస్మా రూ.లక్ష విరాళంగా అందించగా, పూర్వ విద్యార్థులు జి. విద్యాసాగర్ రూ.25 వేలు, ఉదయ్ కిరణ్ మహారాజ్ రూ.2 వేలు, నాగయ్య రూ.7,162 అందించారు. పునర్నిర్మించిన మరుగుదొడ్లను జిల్లా విద్యాశాఖ అధికారి పి. అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మరుగుదొడ్లను సరైన పద్ధతిలో వినియోగించడంతో పాటు వ్యక్తిగత, పాఠశాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో పాఠశాలలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలకు అవసరమైన సౌకర్యం కల్పించేందుకు సహకరించిన దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతినిధులను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కిషోర్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ బోధన్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సురేష్, విద్యావికాస్ శ్రీనివాస్, చక్రవర్తి, జయప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తేల రవి అన్న యువసేన ఆధ్వర్యంలో సుబ్బు జన్మదిన వేడుకలు

- ఘనంగా కేక్ కట్ చేసి వేడుకలు.. సుబ్బుకు శుభాకాంక్షలు తెలిపిన యువసేన సభ్యులు, అభిమానులు

కోటగిరి,/ ఆగస్టు 25 /(జనసంఘర్షణ):



తేల రవి అన్న యువసేన ఆధ్వర్యంలో రవి కుమారుడు సుబ్బు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు, అభిమానులు, స్నేహితులు కలిసి కేక్ కట్ చేసి సుబ్బుకు ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుబ్బు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని యువసేన సభ్యులు ఆకాంక్షించారు. యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంలో తేల రవి అన్న యువసేన ముందుండాలని పలువురు పేర్కొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా సుబ్బుకు.. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు, యువసేన సభ్యుల మధ్య వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. కార్యక్రమంలో తేల రవి అన్న యువసేన సభ్యులు, రవి సార్ అభిమానులు, స్నేహితులు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

- నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు
- ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 25(జనసంఘర్షణ):






చర్ల మండలంలో వివిధ రైతు వేదికల్లో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాత్మకంగా తీసుకున్న కోటి మొక్కల నాటే కార్యక్రమాన్ని, మొదలుపెట్టి వన మహోత్సవంగా మార్చి అన్ని గ్రామాలలో గ్రామపంచాయతీలలో వివిధ ప్రభుత్వ రంగ స్థలాలలో, రైతు వేదికలు మొక్కల నాటే కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందలగోపాల బుచ్చిబాబు, నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరప శ్రీనివాసరావు, ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఎంపీఓ, చర్ల మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విజయ్ నాయుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ పటేలు వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మేడిచర్ల సత్యనారాయణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ మడకం పద్మజ, ఆత్మ కమిటీ డైరెక్టర్ అలవాల బాలు, ఆత్మ కమిటీ డైరెక్టర్ జగదీష్,మేజర్ పంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం, కలివేరు గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ లక్ష్మణ్, సత్యనారాయణపురం గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ చిక్కాల గౌతమి, తెగడ గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ మురళి, ఆర్ కొత్తగూడెం గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ తుర్రం రవికుమార్, చర్ల ఏఈఓ ఆఫ్రిద్, త్యాగడ ఏఈఓ వినీల,వెటర్నరీ అసిస్టెంట్ స్వప్న, పొడుపుకంటి సమ్మక్క, పెద్దలు రాంపండు, వివిధ రకాల వార్డు నంబర్లు పాల్గొని చర్ల మండలంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది.

## జాకోర క్రాస్‌రోడ్డులో కమాన్ నిర్మాణం నిలిపివేయాలి

- అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టడం సరికాదు..
- మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ

చందూర్,/ ఆగస్టు 25/ (జనసంఘర్షణ):




నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జాకోర క్రాస్‌రోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలో చేపడుతున్న స్వాగత తోరణం (కమాన్) నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వర్ని తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలో సంబంధిత శాఖల అనుమతులు లేకుండా కమాన్ నిర్మాణ పనులు ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. నిర్మాణం పూర్తయితే రహదారిపై రాకపోకలకు ఆటంకం ఏర్పడి, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, రహదారి వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని, నిర్మాణ పనులను నిలిపివేసి నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వర్ని మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మరిగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ.. భక్తులకు ఆధ్యాత్మిక సందడి

కోటగిరి, /ఆగస్టు 25/ (జనసంఘర్షణ):



కోటగిరి మండల కేంద్రంలోని మరిగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మరిగమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి, వార్షికోత్సవ కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న ప్రముఖులు, సేవకులను ఘనంగా సన్మానించారు. ఆలయ సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఏడాది వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

- నిరాడంబర కమ్యూనిస్టు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగా ఉద్యమం తో,ఎనలేని బంధం

మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, ఆగష్టు 25(జనసంఘర్షణ):

సిపిఎం పార్టీ సీనియర్ నేత,రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు. చెన్నూరు మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోడంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ24-08-2026 ఉదయం 3 గంటలకు తుది శ్వాస వదిలారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించారని వ్యవసాయ రంగ నిపుణుడిగా నీటిపారుదల రంగంలో నిష్ణాతుడిగా అపార అనుభవం కలిగిన నాయకుడని అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు కూడా మల్లారెడ్డి దగ్గర సలహాలు తీసుకునే వారిని అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమని మల్లారెడ్డి మృతికి సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ తరఫున సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రైతాంగా సమస్యలు, భూ సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్మించారు. సీడ్ పత్తి సాగులో నష్టపోతున్న రైతులకు అండగా వ్యవసాయ శాస్త్రవేత్తలను తీసుకువచ్చి పంట పొలాలు సందర్శించి రైతులకు మద్దతుగా రాష్ట్రస్థాయిలో అధికారులతో, మంత్రులతో అనేక పర్యాయాలు చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి ఈ ప్రాంత రైతులకు అండగా నిలబడ్డారని తెలిపారు. వరంగల్ జిల్లాలో పుట్టిన మల్లారెడ్డి రాష్ట్రం లో సిపిఎం పార్టీ నిర్మాణంలో రైతు సంగం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి




వర్గ సభ్యులుగా, కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా, బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. కమ్యూనిస్టు నిరాడంబరమైన జీవితం గడిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిడం సమ్మక్క, మధు నక్క, మహేశ్వరి, రేణుక, సత్తక్క తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో ఏసీబీ ట్రాప్..

- జువెలరీ షాపు రికార్డుల ఆడిట్ విషయంలో రూ.లక్ష డిమాండ్..
- రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

నిర్మల్, ఆగస్టు 25 (జనసంఘర్షణ):



నిర్మల్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో ఇద్దరు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జువెలరీ షాపు రికార్డుల ఆడిట్ విషయంలో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా మొదటి విడతగా రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడి చేసి పట్టుకున్నట్లు సమాచారం. కమర్షియల్ ట్యాక్స్‌కు చెందిన గోదావరి, సాయి కృష్ణ అనే అధికారులు లంచం తీసుకుంటుండగా ఏసీబీ బృందం ట్రాప్ నిర్వహించినట్లు తెలుస్తోంది.

**లంచం తీసుకుంటే చర్యలు తప్పవు.. ఏసీబీ హెచ్చరిక**

ప్రభుత్వ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేయడం లేదా స్వీకరించడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరిస్తున్నారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



# కారేపల్లి మాంటిసోరి స్కూల్లో ఘనంగా ఓనం వేడుకలు...

- ప్రిన్సిపల్ మిని కారేపల్లి మాంటిసోరి స్కూల్లో ఘనంగా ఓనం వేడుకలు...

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

కారేపల్లి మాంటిసోరి స్కూల్లో ఓనం పండుగ వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మినీ జోజో అధ్యక్షతన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రంగురంగుల పూలతో ఆకర్షణీయమైన 'పూకళం' (పూల రంగవల్లి)ని తీర్చిదిద్దారు. సంప్రదాయ కేరళ దుస్తుల్లో విచ్చేసిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తిరువాతిరకళి నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ మినీ జోజో మాట్లాడుతూ.. ఓనం పండుగ సమృద్ధికి, ఐక్యతకు,భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మన సంస్కృతి,పండుగల విశిష్టతను తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని అన్నారు. వేడుకల చివరలో విద్యార్థులకు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కారేపల్లి మాంటిసోరి స్కూల్లో ఓనం పండుగ వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మినీ జోజో అధ్యక్షతన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి



రంగురంగుల పూలతో ఆకర్షణీయమైన 'పూకళం' (పూల రంగవల్లి)ని తీర్చిదిద్దారు. సంప్రదాయ కేరళ దుస్తుల్లో విచ్చేసిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తిరువాతిరకళి నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ మినీ జోజో మాట్లాడుతూ.. ఓనం పండుగ సమృద్ధికి, ఐక్యతకు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మన సంస్కృతి, పండుగల విశిష్టతను తెలియజేయడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని అన్నారు. వేడుకల చివరలో విద్యార్థులకు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మరిగమ్మ దేవి ఆలయ మూడవ వార్షికోత్సవం

- భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన సర్పంచ్ బర్ల మధుకర్..
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కోటగిరి/, ఆగస్టు 25/ (జన సంఘర్షణ):

కోటగిరి మండలంలోని మరిగమ్మ దేవి ఆలయ మూడవ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రేమాభిమానాలతో అన్నప్రసాదాన్ని వడ్డించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు సహా పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

**అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలి...**





ఈ సందర్భంగా సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ.. "మరిగమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. అమ్మవారి మూడవ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. మరిగమ్మ అమ్మవారి కటాక్షం ప్రతి కుటుంబంపై ఉండి గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు ముందుగానే చేపట్టడంతో కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. మరిగమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా నిలిచేలా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, సర్పంచ్ బర్ల మధుకర్, యువకులు, మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరం







- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి..
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. బాలరాజు
- కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి..
- మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

కామారెడ్డి, ఆగస్టు 25 (జనసంఘర్షణ):

కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. బాలరాజు పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో ఏఐటీయూసీ నాలుగో జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. బాలరాజు జెండావిష్కరణ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. బాలరాజు అధ్యక్షతన జరిగిన మహాసభకు కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు, పని భద్రత, నిర్ణీత పని గంటలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, పెట్రోల్, గ్యాస్ ధరలతో సామాన్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికులు గౌరవప్రదమైన జీవనం సాగించేలా కనీస వేతనాలను అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టే పోరాటాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

**కార్మికుల హక్కుల కోసం దేశవ్యాప్త పోరాటాలు**

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. బాలరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం లేకుండా వారి శ్రమను దోచుకోవడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, నల్లధనాన్ని వెలికితీసి ధరలను నియంత్రించాలని కోరారు. గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే చర్యగా ఆయన అభివర్ణించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రాకపోతే దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

**సెప్టెంబర్‌లో కరీంనగర్‌లో రాష్ట్ర మహాసభలు**

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు ఎస్. బాలరాజు తెలిపారు. సెప్టెంబర్ 6న భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నామని, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అమర్‌జీత్ కౌర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను మహాసభల్లో చర్చించి నిర్ణయించారు. కార్మికుల హక్కులు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కోసం సంఘటితంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. బాలరాజు, జిల్లా అధ్యక్షుడు ఎస్. బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు దశరథ్, లక్ష్మణ్, జిల్లా నాయకులు ప్రవీణ్, రఫీక్, శ్రీనివాస్, భీమయ్య, బాజీ, రాజిరెడ్డి, దుబాస్ రాములు, ఆర్. లక్ష్మణ్, జి. రాజు, రాజేందర్, సునీత, విజయలక్ష్మి, అనిత, రాజ్యలక్ష్మి, లావణ్య, కృష్ణ, ఖదీర్, వెంకట్ గౌడ్, శివాజీ, దేవరాజు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు మహాసభకు హాజరయ్యారు.

# చర్ల మండలంలో బార్బర్స్‌ల వివక్షత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 25(జనసంఘర్షణ):

చర్లలో గండేటి సూర్యనారాయణ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు, బంధువులు, కులస్తులు అందరు ఐకమత్యంతో ఉండాలని, సమస్యలు ఉంటే సంఘ సభ్యులకు తెలియజెయాలని, వివక్షత చూపకూడదని, బేదాభిప్రారాలు ఉంటే సంఘం కు తేలియజేయాలని అభిప్రాయం వ్యక్త పరిచారు.

# కాలువలో కొట్టుకొచ్చిన నాలుగు గేదెలు

- శంకోర గ్రామ పంచాయతీ పరిధిలో ఘటన..
- యజమానులను గుర్తించేందుకు స్థానికుల ప్రయత్నం

శంకోర,/ ఆగస్టు 25 /(జనసంఘర్షణ):



శంకోర గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువలో నాలుగు గేదెలు కొట్టుకొచ్చి కనిపించాయి. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి సంబంధిత గ్రామస్తులకు సమాచారం అందించారు. కాలువలో కొట్టుకొచ్చిన గేదెలు ప్రస్తుతం శంకోర గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. గేదెల యజమానులు ఎవరైనా ఉంటే వెంటనే గుర్తించి, సంబంధిత వివరాలతో గ్రామస్థులను సంప్రదించి తమ పశువులను తీసుకెళ్లాలని కోరుతున్నారు. ఈ సమాచారాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తెలియజేసి, గేదెల యజమానులను గుర్తించేందుకు సహకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరైనా తమ గేదెలను గుర్తిస్తే వెంటనే స్పందించి వాటిని సురక్షితంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ సమాచారాన్ని అందరికీ షేర్ చేసి, గేదెల యజమానులను గుర్తించేందుకు సహకరించండి. శంకోర గ్రామ పంచాయతీ గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ని ఘనంగా సన్మానించిన సింగరేణి సంఘాల నాయకులు

ఆగస్టు 25 /(జనసంఘర్షణ):



సింగరేణి ఉజ్వల భవిష్యత్తు కోసం కీలక బొగ్గు బ్లాక్‌ల సాధనతో పాటు, సంస్థను కీలక ఖనిజాల మైనింగ్ వైపు విస్తరిస్తున్నందుకు సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి ఆత్మలాంటి సింగరేణి సంస్థను కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయకమైన సంస్థగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులు విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో బొగ్గు, థర్మల్ పవర్‌పై ఆధారపడటం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా బీఎస్ఎన్ఎల్ తరహాలో వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందుకే కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్, బంగారం వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణిని తీసుకెళు న్నామని తెలిపారు. ఇప్పటికే కర్ణాటకలో గోల్డ్ మైన్ వేలంలో సింగరేణి విజయం సాధించిందన్నారు. నైని, తాడిచర్ల-2, మణుగూరు డిప్‌సైడ్-2 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లను సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేసిందని, సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మరిన్ని మైనింగ్ అవకాశాలను అందిపుచ్చుకునేలా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సింగరేణిని ఎన్టీపీసీ స్థాయిలో దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థగా, అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమర్థవంతమైన నాయకత్వంలో సింగరేణి కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొనియాడారు.

# విద్యతో పాటు మంచి విలువలు నేర్పాలి: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ..
- అధ్యాపకులకు కీలక సూచనలు!!!!!





**బోధన్,/ ఆగస్టు 25/ (జనసంఘర్షణ):** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారిలో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించాలని బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర సలహాదారు సుదర్శన్‌రెడ్డి సూచించారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలకు చేరుకున్న ఎమ్మెల్యే తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశమై విద్యార్థుల విద్యాభ్యాసం, హాజరు, కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, ఇతర సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, మానవతా విలువలను నేర్పినప్పుడే విద్యకు సంపూర్ణ అర్థం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల చదువు విషయంలో అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. బోధనలో నిర్లక్ష్యం, అలసత్వాన్ని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి చదువులో పురోగతి సాధించేలా అధ్యాపకులు నిరంతరం పర్యవేక్షించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు... అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని... అధ్యాపకులు సమష్టిగా పనిచేస్తే కళాశాల మరింత మెరుగైన ఫలితాలు సాధించగలదని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీతో కళాశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు.

# చిన్ననాటి మిత్రుడికి ఆత్మీయ సన్మానం

- పదవీ విరమణ చేసిన మాజీ ఎస్సై గంధపు రాజును ఘనంగా సత్కరించిన డాక్టర్ ఎంఏ అఖీమ్..

**పోతంగల్, ఆగస్టు 25/ (జనసంఘర్షణ):** చిన్ననాటి స్నేహం...ఎన్నేళ్లు గడిచినా చెదరని అనుబంధం.. పదవులు, హోదాలు మారినా మరిచిపోని మైత్రి. పోతంగల్ మండల కేంద్రంలో ఇలాంటి ఆత్మీయ సన్నివేశం చోటుచేసుకుంది. జిల్లపల్లి ఫారం గ్రామానికి చెందిన పెద్దలు, భారత రాష్ట్ర సమితి నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎంఏ అఖీమ్ తన బాల్యమిత్రుడు గంధపు రాజును కలుసుకుని ఘనంగా సన్మానించారు. పాత పోతంగల్ గ్రామానికి చెందిన గంధపు రాజు పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రతిభ, సేవల ఆధారంగా ఎస్సైగా పదోన్నతి పొంది బాధ్యతలు నిర్వహించారు. పోలీసు శాఖలో కొన్నేళ్లపాటు సేవలందించిన అనంతరం ఎస్సైగా పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామానికి వచ్చిన బాల్యమిత్రుడు గంధపు రాజును డాక్టర్ ఎంఏ అఖీమ్ ఆత్మీయంగా కలుసుకున్నారు..ఈ సందర్భంగా ఇద్దరూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మాజీ ఎస్సై గంధపు రాజును శాలువాతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ అఖీమ్ మాట్లాడుతూ.. చిన్ననాటి స్నేహాలు జీవితంలో ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతాయని అన్నారు. తన బాల్యమిత్రుడు పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సైగా ఎదిగి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేయడం గర్వంగా ఉందన్నారు. ఎన్నేళ్లు గడిచినా తమ స్నేహబంధం కొనసాగడం ఆనందంగా ఉందని తెలిపారు. మాజీ ఎస్సై గంధపు రాజు మాట్లాడుతూ తన బాల్యమిత్రుడు...డాక్టర్ ఎంఏ అఖీమ్ చూపిన ఆప్యాయత, గౌరవం మరువలేనిదని అన్నారు.



చిన్ననాటి స్నేహితుడిగా తనను గుర్తించి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మిత్రులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకోవడంతో అక్కడ స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. స్నేహానికి కాలం అడ్డుకాదని, నిజమైన మైత్రికి పదవులు, హోదాలు, దూరాలు ఏమాత్రం అడ్డంకులు కావని చాటిచెప్పేలా ఈ కలయిక నిలిచింది. ఈ కార్యక్రమంలో అర్జున్ సెట్, యూసుఫ్, ఎజాజ్ ఖాన్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ మండల ప్రజావాణికి 8 దరఖాస్తులు..

- ప్రజావాణిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో చందర్ నాయక్.

**పోతంగల్, ఆగస్టు 25 (జనసంఘర్షణ):** పోతంగల్ రైతు వేదికలో నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమానికి వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని కోరుతూ మొత్తం 8 దరఖాస్తులను సమర్పించారు. ఈ విషయాన్ని ఎంపీడీవో చందర్ నాయక్ వెల్లడించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి నాలుగు దరఖాస్తులు.... అందగా, మండల విద్యాశాఖకు ఒకటి, ప్రభుత్వ ఆసుపత్రికి ఒకటి, ఇందిరమ్మ ఇళ్ల కోసం రెండు దరఖాస్తులు వచ్చాయి. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసుకుని, సమస్యల స్వభావాన్ని పరిశీలించారు. కాగా, పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ....




భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బజరంగ్ హనుమాన్లు ప్రజావాణిలో ప్రత్యేకంగా వినతి సమర్పించారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల్లో మూత్రశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, పాఠశాలలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడితే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందర్ నాయక్ మాట్లాడుతూ...ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిపై అవసరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుపై అధికారులు ప్రత్యేక దృష్టి.. సారించి, అర్హతలు మరియు నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులకు స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులు కూడా అవసరమైన వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో పోతంగల్ మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు... పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి చక్కటి వేదికగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# వనమహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్ ధర్మతేజ..

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి: సర్పంచ్ ధర్మతేజ, ఎంపీడీవో శ్రీనిధి



**బీర్కూర్, ఆగస్టు 25 (జన సంఘర్షణ):** బీర్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మతేజ, ఎంపీడీవో శ్రీనిధి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, అడవుల సంరక్షణపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ ధర్మతేజ, ఎంపీడీవో శ్రీనిధి మాట్లాడుతూ వనమహోత్సవం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెద్ద చెట్టుగా పెంచడమే దీని ప్రధాన లక్ష్యమని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చెట్లు ఆక్సిజన్‌ను అందించడంతో పాటు వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్‌ను గ్రహిస్తాయని, వర్షపాతం, భూగర్భ జలాల సంరక్షణ, పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించడం అత్యవసరమన్నారు. మొక్క నాటడం బాధ్యతకు తొలి అడుగు.. దాన్ని చెట్టుగా పెంచడం అసలైన బాధ్యత అని పేర్కొంటూ విద్యార్థులు, ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనిధి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, వైస్ చైర్మన్ రాములు, ఎంపీఓ మెహబూబ్, ఉప సర్పంచ్ పరమేష్, బసవరాజు పటేల్, ఆత్మ కమిటీ సభ్యుడు శంకర్, వార్డు సభ్యులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్టుపై సమీక్ష...

- భూసేకరణ బిల్లులన్నీ చెల్లించాం..
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 25 (జనసంఘర్షణ):**



దేవాదుల ఎత్తిపోతల పథకం పురోగతిపై ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నియోజకవర్గంలోని దేవాదుల కాలువలు, భూసేకరణ, నీటి సరఫరాకు సంబంధించిన పెండింగ్ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఆయకట్టుకు దేవాదుల నీరు అందేలా పనులను వేగవంతం చేయాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పెండింగ్ బిల్లులన్నీ పూర్తిగా చెల్లించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఇకపై ఒక్క బిల్లు కూడా పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు సకాలంలో బకాయిలు చెల్లిస్తూ, ప్రాజెక్టు పనులను పూర్తి చేసి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# కోటగిరి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కొండాపూర్ పోశెట్టి

- ఏకగ్రీవంగా నూతన మండల కమిటీ ఎన్నిక.. మాదిగల ఐక్యత, హక్కుల సాధనకు కృషి చేయాలని నాయకుల పిలుపు

**కోటగిరి,/ ఆగస్టు 25/ (జన సంఘర్షణ):**





కోటగిరి మండల కేంద్రంలోని ఏబీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ముసాయిపేట యాదగిరి మాదిగ, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం మాదిగ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి ముసాయిపేట యాదగిరి మాదిగ.. మాట్లాడుతూ.. మాదిగలందరూ ఐక్యంగా ఉండాలని, కులస్తులకు, సంఘానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పెద్దల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం మాదిగ మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా మాదిగలు ఐక్యంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేకపోయారని అన్నారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ఫలితంగా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి మాదిగ యువకుడు సద్వినియోగం చేసుకునేలా నూతన కమిటీ సహకరించాలని కోరారు.

**నూతన కార్యవర్గం....**

మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా కొండాపూర్ పోశెట్టి (పండు) మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడిగా పేగు లాలయ్య మాదిగను నియమించారు. ఉపాధ్యక్షులుగా తమ్మ్లారి శీను మాదిగ, భోగం శంకర్ మాదిగ, గడ్డం కృష్ణకుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కర్రేవారి శ్రీకాంత్ మాదిగ, కార్యదర్శిగా కె. సాయిబాబా మాదిగ బాధ్యతలు స్వీకరించారు. ప్రచార కార్యదర్శులు...గా ఎడ్ల సాయిలు మాదిగ, ఎడ్ల శంకర్ మాదిగ, కోశాధికారిగా కన్నం శ్రీనివాస్ మాదిగను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మేత్రి రాజు మాదిగ, కన్నం సాయిలు మాదిగ, మల్లె శ్రీనివాస్ మాదిగ, రేణి ప్రశాంత్ మాదిగ, గడ్డం శివకుమార్ మాదిగలకు బాధ్యతలు అప్పగించారు. నూతన కమిటీ సభ్యులతో నాయకులు ప్రతిజ్ఞ చేయించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు కొండాపూర్ పోశెట్టి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అందరి సహాయ సహకారాలతో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమం అనంతరం నూతన మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల మాదిగ నాయకులు జిల్లా ఇన్‌చార్జి యాదగిరి మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం మాదిగలకు కృతజ్ఞతలు తెలిపారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
26 ఆగస్టు 2026

## మంత్రి గణేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

- ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి..
- అభిమానులు, నాయకుల ఆకాంక్ష

బాన్సువాడ/, ఆగస్టు 25 / (జనసంఘర్షణ):



బాన్సువాడ నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్‌కు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలే కుటుంబంగా భావిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తున్న మంత్రి గణేష్ సేవా ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పేదలు, రైతులు, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయన సేవా స్ఫూర్తి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రజల నమ్మకాన్ని మరింతగా సంపాదించుకుంటూ సేవా లికార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఏనుగు రవీందర్ రెడ్డి నమ్మకమైన అనుచరుడిగా, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ ముందుకు సాగుతున్న మంత్రి గణేష్ రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఆయనకు కలగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిన జీవితం సాగించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు తదితరులు మంత్రి గణేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్ వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందన

మనుబోలు. 25.8.2026 (జనసంఘర్షణ):



సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలుగా నియమితులైన 36 మందిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మంగళవారం శుభాకాంక్షలు చెప్పే అభినందించారు. నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.తో అంగన్వాడీలు మర్యాద పూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలియజేసిన సోమిరెడ్డి. అంగన్ వాడీ కేంద్రాల్లో అంకితభావంతో పనిచేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

## పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వ భరోసా

- ఏడుగురు పబ్లిక్ హెల్త్ వర్కర్ల కుటుంబాలకు రూ.14 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులు

నాయుడుపేట, ఆగస్టు 25 (జనసంఘర్షణ):



నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొని, విధి నిర్వహణలో మృతి చెందిన ఏడుగురు పబ్లిక్ హెల్త్ వర్కర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 14 లక్షల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## పాత బిల్లులు చెల్లించట్లేదని ప్రజావాణిలో మాజీ సర్పంచ్ ఫిర్యాదు...

- 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి బిల్లులు మంజూరు చేయాలని పత్తి లక్ష్మణ్ వినతి...

కోటగిరి, ఆగస్టు 25 (జన సంఘర్షణ):



తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపిస్తూ కోటగిరి గ్రామ మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం కోటగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు.

పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ.... 2018 నుంచి 2024 వరకు కోటగిరి గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కోటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి 50 పడకల ఆసుపత్రి మంజూరు కావడంతో పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాన్ని మరో ప్రభుత్వ భవనంలోకి మార్చేందుకు రిపేర్లు, ఫ్లోరింగ్, వైరింగ్, తలుపులు, కిటికీలు, కలరింగ్ తదితర పనులు చేయించి ఆసుపత్రికి అప్పగించినట్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా గ్రామంలోని మురుగు కాలువలను ప్రైవేట్ కూలీలతో శుభ్రం చేయించినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించిన ఖర్చులను గ్రామపంచాయతీలో తీర్మానించి, ఎంబీలు కూడా చేయించినట్లు చెప్పారు. అయితే తన పదవీకాలం చివర్లో 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో లేకపోవడంతో బిల్లులు పొందలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తన పదవీకాలం ముగిసిన తర్వాత స్పెషల్ ఆఫీసర్ పాలనలోకి పంచాయతీ వెళ్లిన సమయంలో సంబంధిత ఎంబీలు, తీర్మానాలను అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం నూతన పాలకవర్గం ఏర్పడినప్పటికీ, తాను చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకుండా రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలి....**

15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి తనకు రావాల్సిన బిల్లులను మంజూరు చేసి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సంబంధిత తీర్మానాలు, ఎంబీ రికార్డులను పరిశీలించి తనకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫిర్యాదుకు ఆధారంగా ఎంబీ రికార్డుల జిరాక్స్ కాపీలు, పంచాయతీ తీర్మానాల.. ప్రతులు, స్పెషల్ ఆఫీసర్‌కు ఇన్‌చార్జ్ అప్పగించిన జాబితా, నూతన పాలకవర్గం తీర్మానం జిరాక్స్ కాపీలను అధికారులకు సమర్పించినట్లు పత్తి లక్ష్మణ్ తెలిపారు.

## పోతంగల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి..





- బాలికల కోసం మరుగుదొడ్లు నిర్మించాలి..
- పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో బీజేపీ వినతి....

పోతంగల్, ఆగస్టు 25/(జన సంఘర్షణ):

పోతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు కే. హన్మాండ్లు, గ్రామ ప్రజలు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోతంగల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరారు.

**శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలి!**

పోతంగల్‌లోని పాత పాఠశాల భవనాలను అధికారులు పరిశీలించి, శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాత భవనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఉర్దూ పాఠశాలకు ప్రత్యేక భవనం నిర్మించాలని, పాఠశాలలకు అవసరమైన ప్రహరీ గోడలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలని తెలిపారు.

**ప్రజావాణిలో అధికారులకు వినతి....**

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రహరీ గోడలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. పాఠశాలల సమస్యలను పరిశీలించి నిధులు మంజూరు చేసి పనులను త్వరితగతిన చేపట్టాలని ప్రజావాణి ద్వారా అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బీజేపీ అధ్యక్షుడు కే. హన్మాండ్లు, మక్కయ్య , శంకర్, వేమన్న పటేల్, ఉమాకాంత్ మెడికల్ సెట్, పల్లె శంకర్, దారపు గంగారం, బీజేపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని పాఠశాలల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## తగిలేపల్లి మాజీ సర్పంచ్ హత్యకు నిరసనగా ధర్నా





- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..
- ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలి: పోచారం భాస్కర్ రెడ్డి



వర్ని,/ ఆగస్టు 25/ (జనసంఘర్షణ):

వర్ని మండలం తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటేశ్వర్లు (వెంకన్న) హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో హత్యలు, హింసకు తావులేని శాంతియుత వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాజీ సర్పంచ్ వెంకన్న హత్య తీవ్రంగా కలచివేసిందని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి హత్యకు దారితీసిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నిందితుడిగా బక్క నారాయణ పోలీసుల ఎదుట లొంగిపోయిన నేపథ్యంలో, హత్య వెనుక ఉన్న కారణాలు, ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా సందర్భంగా నాయకులు, కార్యకర్తలు హత్యా రాజకీయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో శాంతి, సామరస్యాలను కాపాడాలని, ప్రజల్లో భయాందోళనలు కలిగించే పరిస్థితులకు ముగింపు పలకాలని పోచారం భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. "హత్యా రాజకీయాలు నశించాలి.. హింసాత్మక రాజకీయాలకు చరమగీతం పాడాలి.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి.. బాన్సువాడలో శాంతి, సామరస్యం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co